క్లుప్తంగా

పుష్కర స్నానమాచరించిన మేయర్



పుష్కర స్నానం ఆచరిస్తున్న మేయర్ నీరజ, కుటుంబ సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: దక్షిణ త్రివేణి సంగమంగా పేరొందిన కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాల్లో మేయర్ పునుకొల్లు నీరజ రామబ్రాహ్మం కుటుంబ సభ్యులతో కలిసి పుష్కర స్నానం ఆచరించారు. నదీ తీరం వెంబడి దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించాక ఆలయానికి చేరుకుని శ్రీకాళేశ్వర, ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

తిరుమలాయపాలెం: మండలంలోని బీరోలు గ్రామంలో ఖమ్మం ఎస్ వీ ఐకేర్, లేజర్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్తామాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కె.విజమ్‌ప్రకాష్ కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్‌లు ఫాకో (లేజర్) సర్జరీలు ద్వారా అతి తక్కువ ధరలో అందించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి నిర్వాహకుడు దరిపల్లి ఉత్తేజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల సాహితీ వేత్తలకు విశిష్ట సత్కారం



సన్మానం పొందిన సునంద, షఫీ, కృష్ణయ్య, వెంకటయ్య

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ సరస్వత పరిషత్ 82వ స్థాపన దినోత్సవ సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం శాంతా వసంత ట్రస్ట్ ఆధ్వర్యాన జిల్లాకు చెందిన బాల సాహితీ వేత్తలు, ఉపాధ్యాయులను సాహిత్య విశిష్ట సత్కారాన్ని అందించి సత్కరించారు. గత ఇరవై ఏళ్లగా పిల్లల్లో కథా కవితా రచనలు చేయిస్తూ.. స్వయంగా సాహితీ సృజన చేస్తూ పుస్తకాలు ప్రచురిస్తున్న వారి కృషిని గుర్తించి జిల్లాకు చెందిన కన్నెగంటి వెంకటయ్య, కొమ్మవరపు కృష్ణయ్య, సయ్యద్ షఫీ, ఉరిమళ్ల సునందలను తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, కార్యదర్శి జుర్రు చెన్నయ్య, శాంతా–వసంత ట్రస్టు చైర్మన్ పద్మ భూషణ్ డాక్టర్ వరప్రసాదరెడ్డిలు, ప్రముఖ బాలసాహితీ వేత్తలు డాక్టర్ పత్తిపాక మోహన్, గరిపల్లి అశోక్‌ల ఆధ్వర్యాన నగదు, మెమెంటో శాలువాలతో ఘనంగా సత్కరించారు. సన్మానం పొందిన ఉపాధ్యాయులకు పలువురు అభినందనలు తెలిపారు.

కార్మికులపై ప్రభుత్వాలకు నిర్లక్ష్యం తగదు..

నేలకొండపల్లి: ప్రభుత్వాలకు కార్మికులపై నిర్లక్ష్యం తగదని సీఐటీయూ జిల్లా నాయకుడు పగిడికత్తుల నాగేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న జరగాల్సిన సార్వత్రిక సమ్మె వచ్చే నెల 9కి వాయిదా వేసినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై క్షేత్రస్థాయిలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలని, 60 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో కార్మికులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కే.వీ.రెడ్డి, కట్టికోల వెంకన్న, గంజికుంట్ల వెంకటయ్య, పొట్టపింజర స్టాలిన్, పెద్దపాక మల్లేశ్వరరావు, కే.వీ.చారి, సైదమ్మ, తిరపరావు, డి.నాగేశ్వరరావు, కె.లక్ష్మయ్యయ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	20	పాలకూర	4
పచ్చిమిర్చి	36		20
కాకర	66	చుక్కకూర	3
బీర	46		20
దొండ	18	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	96	గోంగూర	4
గోరుచిక్కుడు	40		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	56		20
బీట్‌రూట్	30	-ఖమ్మం వ్యవసాయం	

తీగలు యమపాశమై..





పురానితండాలో మృతి చెందిన పశువులు(ఫైల్)



మూగజీవాలను పొట్టనబెట్టుకుంటున్న విద్యుత్ తీగలు

- ఒక్క వారంలోనే ఆరు జీవాలు మృతి
- ప్రమాదాల నివారణకు చర్యలు శూన్యం
- ఆర్థికంగా నష్టపోతున్న పెంపకందారులు

రఘునాథపాలెం/ఖమ్మంఅర్బన్: గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు మూగజీవాలకు ప్రాణాంతకంగా మారుతున్నాయి. గత వారం రోజులుగా రఘునాథపాలెం మండలంలో పలు గ్రామాల్లో తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి ఆరు పశువులు మృత్యువాత పడిన ఘటనలు కలకలం రేపుతున్నాయి.

అకాల వర్షాలతో..

వేసవి నేపథ్యాన మేత కోసం రైతులు తమ పశువులను బయటకు వదిలిపెడుతున్నారు. ఈక్రమంలో ఇటీవల గాలి దుమారాలు, అకాల వర్షాలు తీవ్ర స్థాయిలో ఉండడంతో కొన్నిచోట్ల విద్యుత్ తీగలు తెగిపడడం, మరికొన్ని చోట్ల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్ తీగలకు తగిలి మృత్యువాత పడుతున్న ఘటనలు జరుగుతున్నాయి. తెగిపడిన తీగల సమాచారం అధికారులకు తెలియకపోవడం, వీటిని సమయానికి గుర్తించి చర్యలు తీసుకోకపోవడంతో మేతకు వెళ్లిన పశువులు బలికావాల్సి వస్తోంది.

ఆర్థికంగా కుంగుబాటు..

వేసవి వచ్చిందంటే ఒక వైపు విద్యుత్ షాక్, రోడ్డు ప్రమాదాల రూపంలో పశువులు మృతి చెందుతున్నాయి. దీంతో పెంపకందారులు ఆర్థికంగా కుంగిపోతున్నారు. ఇలా వరుస ఘటనలతో పశువులు మృతి చెందుతుండగా.. అధికారులు సమగ్ర విచారణ చేసి, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. గ్రామాల్లో తెగిపడిన తీగలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలని, ప్రజలు విద్యుత్ శాఖ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇటీవల కొన్ని ఘటనలు..

- ➡ రఘునాథపాలెం మండలంలోని పుతానితండాలో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో ఒకే గ్రామానికి చెందిన మూడు ఆవులు మృతి చెందాయి.
- ➡ ఈ ఘటన నుంచి రైతులు తేరుకోకముందే మండలంలోని చిమ్మపుడిలో తెగి పడిన తీగలను తాకి పాడి గేదె మృతి చెందింది.
- ➡ శనివారం మండల కేంద్రంలో ఓ వెంచర్‌లో తెగి పడిన విద్యుత్ తీగలను తాకి మేతకు వెళ్లిన పాడి గేదె, ఆవు మృతి చెందాయి.
- ➡ ఇదే తరహాలో ఇటీవల నగరంలోని అల్లిపురంలో ఓ పశువు, గతంలో కోటపాడు తదితర గ్రామాల్లో సైతం మృత్యువాత పడ్డాయి.



రఘునాథపాలెం వెంచర్‌లో తెగి పడిన తీగలకు తగిలి మృతి చెందిన గేదె

మేరీ మాత ఉత్సవాలు ప్రారంభం

కూసుమంచి: పాలేరులోని అద్భుతాల మేరీమాత పుణ్యక్షేత్రంలో ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలను ఖమ్మం మేత్రాసనం కోశాధికారి రెవరెండ్ ఫాదర్ సూరేపల్లి ఐజాక్ పతాకావిష్కరణ చేసి ప్రారంభించారు. మేరీమాత స్వరూపానికి పూలమాలలు వేసి తన దైవ సందేశాన్ని అందించారు. ఆసియా ఖండంలోనే 76 అడుగులతో అతిపెద్ద మేరీమాత స్వరూపం పాలేరులో ఏర్పాటు చేయడంతో జిల్లా ఖ్యాతిని ప్రపంచానికి చాటిందన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా 28న మేరీమాత స్వరూపం ఊరేగింపు, 30న ఉమ్మడి జిల్లా బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్‌చే దివ్య బలిపూజ కార్యక్రమాలు జరుగుతాయని, ప్రతి ఒక్కరూ పాల్గొని పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు కొమ్ము అంటోనీ, జోసెఫ్ కొమరెల్లి, లూకాస్, ఆధ్యాత్మిక గీతాల బృంద ఇన్‌చార్జ్ కొమ్ము ప్రసాద్ పాల్గొన్నారు.



పతాకావిష్కరణ చేస్తున్న ఫాదర్ సూరేపల్లి ఐజాక్

ప్రజానాట్యమండలి ద్వారా ప్రజా చైతన్యం



సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

తిరుమలాయపాలెం: ప్రజా సమస్యలపై ఆట పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రజానాట్యమండలి కళాకారులు ముందుంటారని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు వేముల సదానందం అన్నారు. ఆదివారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని గజ్జల వెంకటయ్య భవనంలో జరిగిన పాలేరు డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతరించిపోతున్న కళలు వాటి విలువ సామాజిక సేవా దృక్పథం ప్రజల్లో అవగాహన కల్పించాలని, వీటి కోసం ప్రజానాట్యమండలి అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. పాలకుల విధానాలకు వ్యతిరేకంగా దోపిడీ వ్యవస్థను అంతం చేసి సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్క కళాకారుడు నడుం బిగించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి భవిష్యత్ కర్తవ్యాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి నామ లక్ష్మీనారాయణ ప్రజానాట్యమండలి డివిజన్ ఇన్‌చార్జ్ నంద్ర ప్రసాద్, నాయకులు మారుతి కొండల్‌రావు, నందిగామ కృష్ణ, జ్యోతి, మల్లయ్య, ఉపేందర్, లింగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్

రఘునాథపాలెం: రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ట్రాన్స్‌పోర్ట్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు కలిశారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన మహాత్మ జ్యోతిబా పూలే సినిమా రివ్యూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కొద్దిసేపు చర్చించారు.



మంత్రి పొన్నంతో హనుమంతురావు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న కొదుమూరు పాఠశాల పూర్వ విద్యార్థులు



ఇందిరానగర్ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెం రోడ్డులోని ఒక ఫంక్షన్ హాల్‌లో చింతకాని మండలం కొదుమూరు హైస్కూల్ 1995–96 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ తమ ఆనందాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించి, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తీర్మానించారు. అలాగే నగరంలోని ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతికి చెందిన (2002–03 బ్యాచ్) విద్యార్థులు ఓఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

చేతి వృత్తిదారుల సంక్షేమానికి కృషి

నేలకొండపల్లి: చేతి వృత్తిదారుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని రాయగూడెంలో ఆదివారం పీఎం విశ్వకర్మ పథకం కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. కేంద్రం పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలే పార్టీ గెలుపునకు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొండ హర్షవర్ధన్, కాశంగి వెంకటేశ్వర్లు, పోతనబోయిన శేషు, సూరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

8న జిల్లా ఆర్యవైశ్య కమిటీ ప్రమాణ స్వీకారం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జూన్ 8న కల్లూరులో నిర్వహిస్తున్న మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు తెలిపారు. ఆదివారం నగరంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఉన్న ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పేద ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం మహాసభ పనిచేస్తుందని తెలిపారు. అనంతరం మహాసభకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ప్రతినిధి వర్గం ఆవిష్కరించింది. ఈ సమావేశంలో ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వనమా సూరి, ప్రధాన కార్యదర్శి వనమా కిరణ్‌కుమార్, ద్వితీయ కార్యదర్శి గోల రాధాకృష్ణమూర్తి, కోశాధికారి పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యనిర్వహణ కార్యదర్శి పాలువాయి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకురాలు మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని జూపెడ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు కోటా సత్తమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో సమాచారం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదినేని రమేష్, జిల్లా కమిటీ సభ్యులు నవీన్‌రెడ్డి, ఎస్‌కె.బషీరుద్దీన్, శ్రీను, తుళ్లూరు నాగేశ్వరరావు, వెంకన్న, కోట ఉపేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నూకల శ్రీనివాసరెడ్డి తదితరులు ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు. పార్టీ అభివృద్ధిలో ఆమె చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

మూగజీవాల బాధితులకు అండగా ఉంటా..

- మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరేకోడుతండాలో విషాహారం తిని మృతి చెందిన మూగజీవాల బాధితులకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫోన్‌లో బాధితులకు హామీ ఇచ్చారు. గొర్రెలు, మేకలు మృతి చెందిన విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి వెంటనే స్పందించి బాధితులు అధైర్య పడొద్దని ధైర్యం చెప్పారు.

బాధితులను ఆదుకోవాలి..

విషాహారం తిని గొర్రెలు, మేకలు మృతిచెందిన ఘటనలో బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్‌లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గొర్రెలు, మేకలు మృతితో యజమానులు జీవనాధారం కోల్పోయారని, ప్రభుత్వం స్పందించి వారికి రూ.20 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు.

చినుకు పడితే చిత్తడే..



తిరుమలాయపాలెం: సీపీఎం కార్యాలయం ఎదురుగా నిలిచిన వర్షపు నీరు



తిరుమలాయపాలెం: రోడ్డు పక్కన ఇలా..

తిరుమలాయపాలెం: చిన్న వర్షానికే తిరుమలాయపాలెం మండల కేంద్రం చిత్తడిగా మారుతోంది. ఎలాంటి అభివృద్ధికి నోచుకోని మండల కేంద్రంలో కనీస సౌకర్యాలు లేకపోగా స్టేజీ సమీపాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న గుంతల్లో నీరు నిలుస్తోంది. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయానికి ఎదురుగా నీరు నిల్వ ఉండడంతో దోమల వ్యాప్తి పెరుగుతుందని, కనీసం రోడ్డు పక్కన నిలిచే పరిస్థితి లేదని ప్రజలు వాపోతున్నారు. కొక్కిరేణి నుంచి తిరుమలాయపాలెం వరకు చేపడుతున్న బీటీ రహదారి స్టేజీ సమీపాన వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు మోరీలు వేయకపోవడంతో నీరు నిలుస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు మండల అభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తడిసిన ధాన్యం రాశులు..

నేలకొండపల్లి: మండలంలో ఆదివారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. మండలంలోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం తదితర గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలకు నోచుకోని ధాన్యం రాశులు, పలు చోట్ల కాంటాలు వేసిన బస్తాలు ఎగుమతులు లేక వర్షానికి తడిసిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ధాన్యాన్ని కాంటాలు వేయించాలని, కాంటాలు వేసిన బస్తాలను ఎగుమతులు చేయించాలని పలువురు రైతులు అధికారులను కోరుతున్నారు.



ముజ్జుగూడెం సమీపంలో తడిసిన ధాన్యం

దాతల ఔదార్యం

➡ సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: మండలంలోని బంధంపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ సురేష్–రోజా కూతురు రిషిత అనారోగ్యంతో చికిత్స పొందగా.. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సిఫార్సుతో మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఈనేపథ్యాన ఆదివారం కాంగ్రెస్ నాయకుడు నూకల అభినవ్‌రెడ్డి లబిద్ధదారులకు అందజేయగా.. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ విద్యార్థులకు సర్టిఫికెట్లు..



సర్టిఫికెట్లు అందిస్తున్న సంస్థ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం అమన్ ఇస్లామిక్ సెంటర్ ఆధ్వర్యాన 30 రోజుల ఉచిత ఇస్లామిక్ సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ప్రతీ సంవత్సరం మాదిగానే ఈ ఏడు కూడా 120 మంది విద్యార్థులకు శిక్షణ అందించారు.కాగా, ఆదివారం ఖమ్మం జెడ్పీ మీటింగ్ హాల్‌లో జరిగిన ముగింపు కార్యక్రమంలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లను సంస్థ బాధ్యులు ముఫ్తీ ముజమ్మిల్ ఖాస్మీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖతీబ్ ముఫ్తీ షుజావుద్దీన్ సాహెబ్, ముఫ్తీ సల్మాన్‌ఖాన్ సాహెబ్, అబ్దుల్ హకీమ్, ఫరూఖ్ సాహెబ్, సయ్యద్ ఆరిఫ్ అలీ, నూర్ అల్–మస్జిద్ సదర్ అహ్మద్ ఖాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

➡ గోశాలకు పచ్చగడ్డి..



పచ్చగడ్డి వితరణ చేస్తున్న దాతలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెంలోని ఓంశ్రీకృష్ణ గోశాలకు నగరానికి చెందిన గెల్ల మధు కుమార్తె డాక్టర్ కీర్తిప్రియాంజలి ఆదివారం సందర్భించి ఒక ట్రాక్టరు పచ్చగడ్డి కోసం రూ.6,100 ఆర్థిక సాయం అందించారు. మూగజీవాల ఆకలి తీర్చడానికి దాతలు ముందుకు రావాలని గోశాల నిర్వాహకులు కోరారు.

➡ మృతుడి కుటుంబానికి బియ్యం..

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో ఇటీవల మృతి చెందిన మాజీ వార్డు సభ్యుడు గొర్రె మాధవరావు కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నేతలు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చి, పార్టీ తరఫున 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు జోనబోయిన పాపయ్య, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోటేరు నర్సిరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ్ల గోవర్ధన్, నాయకులు కోటేరు శోధర్‌రెడ్డి, తూము సత్యనారాయణ, పొన్నం యాదగిరి, దొంతు వెంకన్న, కణతాల వెంకన్న, వల్ల పిన్ని మాధవయ్య, ముద్రబోయిన పుల్లయ్య, పరిమిశెట్టి శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

కేఎంసీలో విజిలెన్స్ అలజడి..

- మొన్న ఇంజనీరింగ్.. తాజాగా రెవెన్యూ విభాగాలకు నోటీసులు
- ఇంటి నంబర్ల కేటాయింపు, మ్యుటేషన్లలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు
- నేడు విచారణకు ఆదేశాలు
- బదిలీ అయిన వారికీ నోటీసులు



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో విజిలెన్స్ అలజడి కొనసాగుతోంది. అభివృద్ధి పనుల దగ్గర నుంచి పౌర సేవలు అందించే అధికారులు పలు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. గత ఏడాది ఇంజనీరింగ్ అధికారులకు అభివృద్ధి పనుల్లో జరిగిన అక్రమాలపై నోటీసులు ఇచ్చి విచారణ చేయగా.. తాజాగా రెవెన్యూ విభాగంలో జరిగిన అక్రమాలపై అధికారులు కన్నేశారు. దీనిపై సోమవారం రెవెన్యూ ఉద్యోగులను విచారణ చేయనున్నారు.

రెవెన్యూ విభాగానికి నోటీసులు..

నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగంలో పలు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. 2021 నుంచి ఇప్పటి వరకు పలు అసెస్‌మెంట్ల నంబర్ల కేటాయింపులో అవకతవకలు చోటు చేసుకోవడం, మ్యుటేషన్లలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా 1200లకు పైగా అసెస్‌మెంట్లకు నంబర్లు కేటాయించినట్లు అంచనా. ఔట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న కొందరు కంప్యూటర్ ఆపరేటర్లు అధికారుల లాగిన్లను దుర్వినియోగం చేసినట్లు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. దీనిపై వచ్చిన వార్తా కథనాలు, ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని రెవెన్యూ అధికారులకు విజిలెన్స్ శాఖ నోటీసులు జారీ చేసింది.

నేడు విచారణ..

రెవెన్యూ విభాగంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులు సోమవారం విచారణ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులకు ఇప్పటికే నోటీసులు అందజేశారు. ఆర్ఐలు, ఆర్ఓతో పాటు స్టోర్ విభాగానికి చెందిన ఇద్దరు ఉద్యోగులకు నోటీసులు అందాయి. నోటీసులు అందుకున్న వారిలో రెగ్యులర్‌తో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారు. వీరిలో కొందరు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లగా.. మరికొందరు ఇక్కడే పనిచేస్తున్నారు. వీరంతా వరంగల్ విజిలెన్స్ కార్యాలయానికి విచారణకు హాజరు కావాల్సి ఉంది.

మరోసారి..

గతంలో ఇంజనీరింగ్ అధికారులపై విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. అభివృద్ధి పనుల్లో ఇష్టానుసారంగా వ్యవహరించడంతో పాటు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులపై ఫిర్యాదులు వచ్చాయి. దీంతో విజిలెన్స్ అధికారులు ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యాన జరిగిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. విచారణ పూర్తి చేసిన అనంతరం సంబంధిత ఉద్యోగుల పదోన్నతులు నిలిపివేయడంతో పాటు ఇంక్రిమెంట్లలో కోత విధించినట్లు తెలిసింది. ఈ చర్యలతో ఇంజనీర్లు లబోదిబోమంటున్నారు. మరోసారి రెవెన్యూ విభాగంలోని ఉద్యోగులకు నోటీసులతో ఆందోళన నెలకొంది. విజిలెన్స్ అధికారులు విచారణ అంశం కేఎంసీలో తీవ్ర చర్చనీయంగా మారింది.

బాధ్యతగా పనిచేస్తేనే..

ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ కేఎంసీలో కొంత మంది అధికారుల తీరు మారడం లేదు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ కిందిస్థాయి సిబ్బందికి బాధ్యతలు అప్పగించి పబ్బం గడుపుతున్నారు. ఫిర్యాదులు వస్తే ఆపరేటర్లు చేశారంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే అదనుగా ఆపరేటర్లు కూడా అడ్డదారులు తొక్కుతున్నట్లు తెలుస్తోంది. కీలక విభాగాల్లో ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తుండటంతో పలుచోట్ల అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కీలక విభాగాల్లో రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలని పలువురు కోరుతున్నారు.